
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శుక్రవారం 12 జనవరి 2024



ఫుల్ భరోసా

- వీఆర్ఏలకు సర్కారు ఊరట
- ఉద్యోగ భద్రత కల్పించిన కొత్త ప్రభుత్వం
- వివిధ శాఖల్లో పనిచేస్తున్న వారికి ఐడీకార్డులు, వేతనాలు
- ట్రెజరీ కార్యాలయంలో సాగుతున్న ఆన్‌లైన్ నమోదు
- భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న 396 మంది



కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 11: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల (వీఆర్‌ఏ)కు ఊరట కలిగింది. కొత్త ప్రభుత్వం వారిలో కొంగొత్త ఆశలు నింపింది. ఉద్యోగ భద్రత కల్పిస్తూ భరోసా కల్పించింది. వీఆర్ఏ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసి వారిని విద్యార్హతనుబట్టి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. ఈ ప్రక్రియ జరిగి ఐదు నెలలు కావస్తోంది. అప్పటి నుంచి ఆ ప్రభుత్వం వారికి ఎంప్లాయి ఐడీలను కేటాయించలేదు. దీంతో ఎవరికీ వేతనాలు జమ కాలేదు. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన రేవంత్ సర్కారుకు వీఆర్ఏలు తమ గోడును వినిపించారు. దీనిపై కొత్త ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వీఆర్ఏలకు ఎంప్లాయి ఐడీలు కేటాయించలంటూ సర్క్యులర్‌ను జారీ చేసింది.

భూపాలపల్లి జిల్లాలో 396 మంది వీఆర్ఏలు ఉన్నారు. వీరి వ్యవస్థను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ఉద్యమం నడిచింది. మళ్లీ ఈ వ్యవస్థను పునరుద్ధరించాలని వీఆర్ఏలు పోరాడారు. విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లుగా దశాబ్దకాలంగా సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 80 రోజుల పాటు సమ్మె చేశారు. వివిధ రూపాల్లో ఆందోళన చేయడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగివచ్చింది. సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి వీఆర్ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. జాబ్ చార్టులను, ఉద్యోగ గుర్తింపు కార్డులను మాత్రం జారీ చేయలేదు. దీంతో ఐదు నెలలుగా వేతనాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఐదు శాఖలను బదలాయింపు

వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం వారందరినీ ఖాళీగా ఉన్న ఐదు శాఖలకు కేటాయించింది. విద్యార్హతనుబట్టి రెవెన్యూ, మునిసిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యాశాఖల్లో విధులు కేటాయించగా వారంతా ఐదు నెలలుగా పని చేస్తున్నారు. కానీ, పూర్తి స్థాయిలో వారిని ఆయా శాఖల ఉద్యోగులుగా గుర్తింపు లభించలేదు. ఎంప్లాయిస్ ఐడీలను కేటాయించడంలో గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఈలోగానే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ విషయాన్ని మరచిపోయింది.

అందని వేతనాలు

వీఆర్ఏలుగా ఉన్న వారంతా వివిధ శాఖల్లో చేరినప్పటికీ వారికి వేతనాలు అందడం లేదు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిచేసే ఆయా శాఖల్లో వీరంతా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రిజిష్టరులో సంతకాలు చేసి విధులు నిర్వర్తిస్తున్నారు. వేతనాలు రావడం లేదంటూ పలుమార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా గత ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. వీఆర్ఏలకు గతంలో తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నపుడు రూ.10,500 వేతనం చెల్లించేవారు. ఇప్పుడు విద్యార్హతలను బట్టి మూడు కేటగిరీల్లో సర్దుబాటు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌కు రూ.24,280, రికార్డు అసిస్టెంట్‌కు రూ.22,150, ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌కు రూ.18,000 వరకు వేతనాలు చెల్లించే విధంగా స్కేల్ పోస్టుల్లో నియమించారు. అయినా ఈ వేతనాలు అందడం లేదు.

వీఆర్ఏల్లో హర్షం

వీఆర్ఏలకు ఎంప్లాయి గుర్తింపు కార్డు, వేతనాలు చెల్లించడంపై ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. దశాబ్దకాలంగా గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీఆర్ఏల పాత్ర ఎంతో కీలకంగా ఉండేదని, గత ప్రభుత్వం గుర్తించి వివిధ పోస్టుల్లో నియమించడం, కొత్త ప్రభుత్వం ఎంప్లాయి గుర్తింపు కార్డులు జారీ చేసి వేతనాలు చెల్లిస్తామనడం ఎంతో అభినందనీయమని వీఆర్ఏల జేఏసీ నేతలు అంటున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాల ఎంట్రీ

ప్రభుత్వ ఆదేశాలతో వివిధ శాఖల్లో చేరిన వీఆర్ఏల వివరాలను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయంలో ఇది కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 396 మంది వీఆర్ఏలు ఐదు శాఖలకు వెళ్లగా వారి వివరాలను సేకరిస్తున్నారు. మండలాల వారీగా ఆన్‌లైన్ నమోదు సాగుతోంది. ఇప్పటి వరకు 125 మంది ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ట్రెజరీ అధికారులు తెలిపారు. ట్రెజరీలో ఉన్న ప్రత్యేక పోర్టల్‌లో ఉద్యోగి వివరాలు నమోదు చేయగానే వారికి సంబంధించిన ఐడీ వస్తోంది. దాని ప్రింట్ తీసి అందిస్తున్నారు.



ఉద్యోగుల నుంచి స్వీకరించిన వివరాల దరఖాస్తులు

స్మాల్ బ్రేక్!

- కాళేశ్వరం ప్రాజెక్టుపై ముగిసిన విజిలెన్స్ తనిఖీలు
- హైదరాబాద్‌కు తరలించిన కీలక ఫైళ్లు, హార్ట్ డిస్కులు
- మళ్లీ విచారణ కొనసాగుతుందన్న విజిలెన్స్ ఎస్పీ రమేష్
- సహకరించడం లేదంటూ ఏఈఈపై ఆగ్రహం



సీజ్ చేసిన ఫైళ్లు, హార్ట్ డిస్కులను హైదరాబాద్‌కు తరలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 11: కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడు రోజులపాటు ముమ్మరంగా సాగిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు గురువారం ముగిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంతోపాటు మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ కార్యాలయాల వద్ద మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏకకాలంలో తనిఖీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు అధికారులు నిర్విరామంగా విచారణ చేపట్టారు. మూడు కార్యాలయాల్లోని కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకొని పరిశీలించారు. మొదటి రోజు మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ కార్యాలయాల్లో తనిఖీలు చేసి అక్కడ నుంచి కీలక ఫైళ్లను మహదేవపూర్ ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయానికి తరలించారు. పోలీసు బందోబస్తు నడుమ విచారణ చేపట్టారు. మొదటిరోజు మంగళవారం ఆయా కార్యాలయాల్లో పనిచేసే కొంత మంది అధికారులు అందుబాటులో లేరు. దీంతో మరుసటి రోజు అందరూ విధుల్లోకి రావాలని విజిలెన్స్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులంతా హాజరయ్యారు. ఫైళ్లు, కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని అర్ధరాత్రి వరకు విజిలెన్స్ అధికారులు

మిగతా 8వ పేజీలో...



విలేకరుల సమావేశంలో ఎస్పీ రమేష్, ఇతర అధికారులు

మహాజాతర సక్సెస్ కావాలి

- ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- ఐటీడీఏ పీవో అంకిత్
- ఆదివాసీ సంఘాలు, పూజారులతో సమావేశం



ఐటీడీఏలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పీవో అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 11: మేడారం మహాజాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐటీడీఏ అంకిత్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, పూజారులతో ఆయన గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మహాజాతరను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆదివాసీ సంఘాల నేతలు, పూజారులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ఆదివాసీ సంఘాల నాయకులు, పూజారులు మాట్లాడుతూ జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. మద్యం, కొబ్బరి, బెల్లం దుకాణాలను ఆదివాసీ సంఘాలు, పూజారులకే కేటాయించాలని పీవోను కోరారు. అదేవిధంగా సాధారణంగా షాపు యజమానులకే వర్తించే ధరలకే మేడారంలో మద్యం సరఫరా చేయడంపై ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టాలని అన్నారు. మేడారం ట్రస్ట్‌బోర్డు కమిటీలో గిరిజనేతరులకు అవకాశం కల్పించొద్దని విన్నవించారు. దీనిపై పీవో మాట్లాడుతూ ప్రతిపాదించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జాతరలో ఆదివాసీ సంఘాలు, పూజారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామన్నారు. జాతరకు వచ్చే భక్తులు అన్ని రకాల సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆది వాసీల సంస్కృతీ సాంప్రదాయాలకు విఘాతం కలగకుండా జాతర నిర్వహణ చేపడుతామన్నారు. అందరి సూచనలు, సలహాలు తీసుకొని జాతరను దిగ్విజయం చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోద రస్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, పూజారులు సిద్దబోయిన జగ్గారావు, దాట్ల నాగేశ్వరరావు, పోడెం బాబు, పోడెం రత్నం, కొప్పుల రవి, కృష్ణప్రసాద్, మైపతి అరుణ్‌కుమార్, లక్ష్మణ్‌రావు, సుభద్ర, కబ్బాక శ్రావణ్ కుమార్, గొప్ప సమ్మారావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌కు లంచం వేధింపులు
- రూ. 50 వేలు టేబుల్ డ్రాలో పెట్టిన బాధితురాలు
- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సహకరించిన జూనియర్ అసిస్టెంట్ అరెస్టు
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఘటన



డీఎంహెచ్‌వో ప్రశాంత్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

జనగామ టౌన్, జనవరి 11: జనగామ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ చేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ ఫార్మసిస్ట్ వద్ద లంచం పుచ్చుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనగామ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు... జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే యువతి 2021 నుంచి ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఫార్మసిస్టుగా పనిచేస్తోంది. పర్మనెంట్ ఉద్యోగి వచ్చారనే సాకు చూపించి ఆమెను 2023 అక్టోబర్‌లో తొలగించారు. అదే రోజు సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆమెకు జూనియర్ అసిస్టెంట్ అజహర్ ఫోన్ చేశారు. తిరిగి ఉద్యోగం కావాలంటే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లగా, ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని చెప్పారు. తాను అంత ఇచ్చుకోలేనని డీఎంహెచ్‌వో ప్రశాంత్‌కు తెలిపింది. రూ.50వేల వరకు ఇస్తానని విన్నవించుకుంది.

ఈ క్రమంలో వారం కిందట రూ.50 వేలు చెల్లించింది. అయినా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె డీఎంహెచ్‌వోను ప్రశ్నించింది. మరో రూ.50వేలు ఇవ్వాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పారు.

ఈ క్రమంలో బాధితురాలు ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి డైరెక్షన్‌లో రూ.50వేల నగదు తీసుకుని గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లింది. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బులను కార్యాలయంలోని ఓ టేబుల్‌లో పెట్టింది. ఈ క్రమంలో అక్కడే మాటువేసి వున్న ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి వెళ్లి డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, కె.శ్రీను, ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.



కోటకాల్వకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పంటలు సమృద్ధిగా పండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణారావు

గణపురం, జనవరి 11: పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణారావు అన్నారు. మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు నుంచి కోటకాల్వకు నీటిని ఆయన గురువారం విడదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకతీయ కట్టడమైన గణపసముద్రం చెరువుకు ఘన చరిత్ర ఉందన్నారు. వేలాది ఎకరాలకు నీరందిస్తూ రైతులకు వెన్నెముకగా నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో గణపసముద్రం చెరువు కట్టను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐబీ డీఈ ప్రసాద్, ఏఈ సమ్మారావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, వైస్ ఎంపీపీ అశోక్, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, నాయకులు దుర్గయ్య, అశోక్‌రెడ్డి, బాబురావు, వడ్లకొండ నారాయణ, రామేశ్వర్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమేష్ నాయక్



కాటారం, జనవరి 11: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లావుడ్యా రమేష్ నాయక్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని కేంబ్రిడ్జి హైస్కూల్‌లో గురువారం జరిగిన సమావేశం అనంతరం సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర రమేష్ ఆధ్వర్యంలో ఈ మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి రేపాల గణేష్, కోశాధికారి గుగ్గిళ్ల విజేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ముకులోత్ పరంసింగ్, అదనపు ప్రధాన కార్యదర్శిగా హట్కర్ రమేష్ నాయక్, జిల్లా బాధ్యులుగా పీర్ల మోహన్‌రావు, నీలిమారెడ్డి, సదయ్య, సురేందర్, సంజీవయ్య, సత్యానారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి సదయ్య, ఉపాధ్యక్షుడు సాంబయ్య, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ప్రవీణ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డీఏవో తనిఖీలు



స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీచేస్తున్న డీఏవో హైదర్

ములుగు, జనవరి 11: ములుగు మండలంలోని మల్లంపల్లిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గౌస్‌హైదర్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలు, స్టాక్ రిజిష్టర్ నిర్వహణను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. యాసంగిలో వరి పంట సాగుచేసే రైతులు నాటువేసే సమయంలో అడుగు ఎరువుగా జింక్‌ను తప్పకుండా వాడాలని సూచించారు. డీఏవో వెంట ములుగు మండల వ్యవసాయాధికారి ఎం.సంతోష్ ఉన్నారు.

తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

ములుగు, జనవరి 11: పార్లమెంట్ ఎన్నికలకు సన్నాహకంగా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన సమీక్ష సమావేశానికి జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో బయల్దేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అవలంబించాల్సిన విధానాలపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమి పాలైనప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో 30వేల ఓట్లకుపైగా మెజారిటీ వచ్చిందని అధిష్ఠానానికి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత జిల్లాకు చెందిన పార్టీ నాయకులంతా ఒకచోట కలిసే అవకాశం లభించడంతో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.



తెలంగాణ భవన్‌లో జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావుతో నాయకులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంచాలకుడు యోగేష్ మోహన్ దీక్షిత్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రిత్వశాఖ సంచాలకుడు యోగేష్ మోహన్ దీక్షిత్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంచాలకుడు యోగేష్ మోహన్ దీక్షిత్ అన్నారు. అందులో భాగంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, ఉన్నతాధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్రను జిల్లాలోని ప్రతి గ్రామంలో విజయవంతంగా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

జనవరి 25లోగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని వారిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, అర్హులకు అవి దక్కేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 11: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో కక్కర్ల సంపత్ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యంను తరలిస్తున్నాడని సమాచారం అందడంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 5 ఇన్‌క్లైన్ కమాన్ వద్ద పట్టుకున్నారు. నిందితుడు వద్ద వివరాలు ఆరా తీయగా రేగొండ మండలానికి చెందిన బొల్లపల్లి వెంకట్రావుకు సంబంధించిన 33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రలోని సిరోంచకు చెందిన దళారికి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడు. సంపత్‌ది మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామం. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎస్సై శ్రావణ్ తెలిపారు.

మేడారంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

- స్నానఘట్టాలపై షవర్ బాత్‌లు ఏర్పాటు
- చేతి పంపులకు మరమ్మతులు

8లో

ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం

- గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు
- ఈ నెల 15వ తేదీ వరకు గడువు

హనుమకొండ రూరల్, జనవరి 11: ఎస్సీ గురుకులాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ప్రతిభ కళాశాలలు (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) అసాధారణ ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, నీట్‌లో ఈ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిసి మడికొండలో బాలురకు 1, బాలికలకు 1 కళాశాల ఉంది. ఇందులో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు చొప్పున ఉన్నాయి. విద్యార్థులకు నచ్చినరంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ఈ నెల 15వ తేదీ వరకు గడువు

ప్రస్తుత విద్యాసంవత్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం తమకు ఇష్టమైన కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. సీఈవో కళాశాలల్లో ఇంటర్మీడియేట్ తరగతులతోపాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, క్లాట్, సీఎంఏ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష బహుళ ఐచ్ఛిక పద్ధతిలో తెలుగు, ఇంగ్లీషులో ఉంటుంది. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను రెండో విడతలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీలకు 75శాతం, బీసీలకు 12శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 3శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయించి ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక

ఎస్.విద్యారాణి, ప్రాంతీయ సమన్వయ అధికారి వరంగల్ రీజియన్



ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. అట్టడుగువర్గాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతోపాటు నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్‌లాంటి జాతీయ పోటీపరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తాం. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తాం.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కమలాపూర్, జనవరి 11: మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల రమ(45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు గురువారం పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రమతో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల స్వామికి 25 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా, రమ వ్యవసాయ కూలి పనిచేసి జీవనం గడుపుతున్నారు.

కాగా, గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమ కనిపించకుండా పోయింది సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, దుప్పటి గ్రామస్థులకు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతురాలి సోదరుడు బొమికి సౌందరయ్య ఫిర్యాదు మేరకు రమది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కారు పల్టీ - తప్పిన ప్రమాదం

ఐనవోలు, జనవరి 11: కారు అదుపుతప్పి పంట పొలాల్లో పడి పోయిన సంఘటన పున్నేలు క్రాస్‌రోడ్డు జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గోవర్ధనగిరికి చెందిన రషీద్ వరంగల్ నుంచి పంథిని వైపు కారులో వెళ్తున్నాడు. క్రాస్ రోడ్డు దాటాక కారు అతి వేగంగా కుడివైపు రోడ్డును దాటి ఆర్ అండ్‌బీ సూచికల బోర్డును ఢీకొట్టి 150 అడుగుల దూరంలో ఉన్న మొక్కజొన్న పంటచేనులో పడిపోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. కారు బెల్టు ధరించడం వలన స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారు కుడివైపున దూసుకపోయిన సమయంలో మరే వాహనం ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.



కొత్తకొండలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీకాంత్

కొత్తకొండ జాతరకు ప్రతీరోజు 20 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు హుజూరాబాద్ నుంచి 80 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.60, చిన్నారులకు రూ.30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణికులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి ఉప్పుల భద్రయ్య, సర్పంచ్ దూడల ప్రమీల-సంపత్, ఆర్టీసీ డ్రైవర్ దూడల ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో బట్టల పంపిణీ



బట్టలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ప్రతీ ఏడాది బోధనేతర ఉద్యోగులకు వర్సిటీ అందజేసే ఉచిత బట్టలను (డ్రెస్ కోడ్)ను గురువారం కేయూ పరీక్షల విభాగంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఉద్యోగులకు డ్రెస్‌లను అందచేస్తామని, విధుల్లో ఉన్నప్పుడు డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రెస్‌తో వర్క్ కల్చర్‌తో పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరసింహరావు, ఎఫ్ఓ తోట రాజయ్య, కేయూ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎ.నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ షకూర్, పోలేపాక కోర్నేల్, మల్లికాంబు, మజార్ అలీ, విజయ్,ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఐలోని మల్లన్న డోలు

జాతరకు ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

విభిన్న పద్ధతుల మిళితం.. జానపదుల జాతరగా ప్రాశస్త్యం

రాణి రుద్రమదేవి సైతం సంతానప్రాప్తికి పూజలు



"సకం భాగ్యాలు కలిగి... సంతోషమాత భక్తి కలిగి... అవులు గోవులు కలిగి... అవాలక్ష కావాల్లు కలిగి... ముట్టింది ముచ్చమై పట్టింది బంగారమెమ్మై.. పాలి వాడు దగ్గరై పగవాడు దూరమై.. ఏటికి ఎడ్లు కలిగి పాటికి బర్లు కలిగి... పర్వ తాల మల్లయ్యా... మా పాలి కలిగి ఉండి... పతి పార్వతిలా కొరిమే" అంటూ ఒగ్గు పూజారులు ఢమురుకాల శబ్దాల నడుమ కొలువనుండగా మల్లన్న జాతర వైభవంగా జరగనుంది. ఈ జాతర జానపదుల జాతరగా ప్రాచుర్యం పొందింది. మకర సంక్రమణతో ప్రారంభమయ్యే జాతర ఉగాది వరకు సాగనుంది. కాకతీయుల కాలంలో మొదలైన ఈ క్రమం.. కాలాలు మారినా దినదినం ఇంకా వెలుగొందుతూనే ఉంది. మరో మూడు రోజుల్లో మొదలయ్యే ఈ జాతరలో భక్తులు ఆచరించే తంతుపై ప్రత్యేక కథనం..



ఐనవోలు, జనవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి(మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. పూర్వ కాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి, శైవారాధన పూజలు అందుకుంది. 1100 యేళ్ల కిందట కోరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్న స్వామి ఒక చేతిలో ఖడ్గం మరోచేతిలో త్రిశూలం ఢమురకం తలపై కిరీటం మూతిపై మీసం ఒక ప్రత్యేకతగా దర్శనమిస్తాడు. నిర్వికారి నిరహంకార నిరాకారస్థితి లింగస్వరూపంలో మూలవిరాట్ అర్ధప్రానపట్టం శ్వేత వర్ణము కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషంగా భావిస్తారు. ఖండోభ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మేడమ్మలు కొలువయ్యారు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతిననుసరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

చెలుక, నజరు పట్నం.. పెద్దపట్నం..

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకోని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు దోశడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పొక, ఖర్జూర, పసుపు గౌరవమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైల పోలు తీశాక తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కోట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. ఒక్కపొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే ఆసనం రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామివారికి ఉదయం మేలుకొలుపు, రాత్రి పవలింపు ఒగ్గు పూజారులే చేయం అనావాయితీగా వస్తోంది.

బోనం.. నైవేద్యం..

బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడికాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు.

బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూది పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మతో వరం పొందారు. ఆదే రాక్షసులను సంహరించేందుకు పసుపు (బండారి) బొట్టు, గజ్జెల లాగు తొడిగి జాలి ముసుగు వేసుకొని కొరడా, త్రిశూలం, ఢమురకంతో వచ్చి మల్లికార్జునస్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్ది తీసుక వచ్చి స్వామివారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్తారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్నకు - మంగోలియా దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.

శివసత్తులు.. శివసతులు..

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తోంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషులు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

కొడే కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కొడే(నంది) కోరికలు తీరితే కోడెను కడతారు. పెళ్లి కాని వారు, సంతాన లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కట్టుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం సంప్రదాయం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెట్టుతారు. స్వామి వారికి దోతి, తువ్వాల సమర్పిస్తు ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

గండ దీపం.. శేవాలు..

గండాలు తీరితే గండదీపం పెడతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్ల, జెల్ల చల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాల వారు జాతరకు ముందు పుట్టమన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. నెలపట్టులు నస్పేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల రోజుల పాటు భక్తిపారవశ్యంతో మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతిని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

నృత్యమండపంలో సల్లవడ్డనం

బండారిని పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగించగా పసుపుమయవుతుంది.

సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట పండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లలను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం అనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబుచేసి గ్రామంలోని పురవీధుల గుండా మహానివేదనను ఆలయానికి తీసుకవస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతిపూల బండ్లు తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది.

జాతర, వారాలు

ఐలోని జాతరకు సంబంధించి డిసెంబరు 17న ఆదివారం రోజున స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమిన దృష్టికుంభం ప్రారంభమైంది. ఆపై జాతర మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. ఈ నెల 13న ధ్వజారోహణముతో ఉత్సవాలు ప్రారంభమై 14న భోగి పండుగ 15న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తర్వాత ఉగాది వరకు ప్రతీ ఆది, బుధ వారం వారంతపు జాతర సాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఫ్రీ వీఐపీ పాస్‌ల రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం పెంచేందుకు ఫ్రీ వీఐపీ పాస్‌ల జారీని రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఇక వీఐపీ పాస్‌లను రూ. 200 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని ఈవో గురువారం విలేకరులతో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారం కిందట దేవాదాయ, వివిధ శాఖలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎడాపెడా వీఐపీ పాస్‌లు జారీ చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో వీఐపీ పాస్‌లు రద్దు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీఐపీ పాస్‌ను రూ.200కు జారీ చేయాలని ఈవోకు సూచించారు. అంతేకాకుండా వీఐపీ పాస్‌లను రూ.1.50 లక్షలు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కొనుగోలు చేశారు.

ఐనవోలు జాతరలోనూ..

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో ఈ సారి వీఐపీ పాసులు రద్దు అయ్యాయి. వాటి స్థానంలో వీవీఐపీ టికెట్లను జారీ చేస్తున్నారు. ఒక్కో టికెట్ ధర రూ.500కు ఖరారు చేశారు. దీనికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. యేటా జాతర సందర్భంగా వీఐపీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక్కో పాస్‌పై రూ.500 తీసుకొని రశీదు ఇచ్చేవారు. ఒక పాస్‌పై ఐదుగురు దర్శనానికి వెళ్లేవారు. కిందటేడు వీఐపీ పాసులపై రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. అయితే వీఐపీ పాస్‌లు రాజకీయంగా పక్కదారి పడుతున్నాయని విమర్శలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వీఐపీ పాస్‌లు జారీ చేయవద్దని సూచిస్తు తాను టిక్కెట్ కొనుగోలు చేసి క్యూలైన్లో వస్తానని చెప్పడంతో పాస్‌లను ముద్రించలేదు. యేటా పలువురు తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారు వేలాదిమందిని వీఐపీ క్యూలైన్లో దర్శనాలు చేయించేవారు దీంతో ఈసారి ఆ పద్ధతికి చెక్‌పెట్టడంతో ఆదాయం పెరుగనుంది. ఆలయంలో స్వామి వారి దర్శనాలు, ధర్మదర్శనం(ఉచితం), శీఘ్ర దర్శనం టిక్కెటు ధర (రూ.50), విశిష్ట దర్శనం టిక్కెటు ధర (రూ.100), వీవీఐపీ టిక్కెటు ధర (రూ.500) ఖరారు చేసినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వడ్డెపల్లి, జనవరి 11: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాను డాక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి లోక్‌సభ సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 1996 నుంచి 2001 వరకు చేర్యాల ఎంపీపీగా, జిల్లా డీఆర్‌డీఏ బాడీ సభ్యుడిగా, వరంగల్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా కాకుండా.. జిల్లాలోని అనేక నియోజక వర్గాల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2009 జనరల్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ మహాకూటమి అభ్యర్థిగా, 2014లో వరంగల్ లోక్‌సభకు మహాకూటమి అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న తనకు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉడమల బాల్‌రెడ్డి, మంచాల చిరంజీవి, గోగికార్ కృష్ణకుమార్, ఉప్పుల రాములు, గౌరవేని శివకుమార్, ముస్త్యాల జార్జి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణను కలిసిన లెనిన్



నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

సుబేదారి, జనవరి11: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జర్నలిస్టు నాయకుడు బీఆర్ లెనిన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్‌అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఈ సందర్భంగా లెనిన్ విజ్ఞప్తి చేశారు. లెనిన్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

హనుమకొండ రూరల్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జన్నె మొగిలి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్నె మొగిలి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో సుమారు 26 యేళ్లుగా పనిచేస్తూ, జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిసి ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

గోపాల్‌పూర్ చెరువులో గుడిసెల కూల్చివేత

ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్

వడ్డెపల్లి, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌పరిధిలోని గోపాల్‌పూర్ చెరువులో పేదలు వేసుకున్న గుడిసెలను జిల్లా యంత్రాంగం గురువారం తెల్లవారు జామున కూల్చివేసింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసుల ఆధ్వర్యంలో చెరువులోని గుడిసెలను కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోపాల్‌పూర్ చెరువు శిఖం సర్వే నంబర్ 89లో సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలు చెరువు శిఖంలోని స్థలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, నీటి పారుదల శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులతో ఎక్స్‌కావేటర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. గుడిసెలను ప్రభుత్వ యంత్రాంగం తొలగించడంతో గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయులయ్యారు. పేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమని సీపీఎం నేతలు తేలూరి ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, కూస రాజేష్‌లు ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచన చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



గుడిసెవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుబేదారి: గోపాలపురం చెరువు శిఖంలో 2 యేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సంబంధించిన గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి పెద్ద సంఖ్యలో గుడిసెవాసులతో సీపీఎం నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. అర్ధరాత్రి మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో గుడిసెలు తొలగించడం సరైంది కాదన్నారు. అనంతరం గుడిసెవాసుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, వెంకట్, తిరుపతి, కిశోర్‌తోపాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

ఈనెల 13న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కైట్ ఫెస్టివల్

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శనివారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను నిర్వహించనున్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. సంక్రాంతి పర్వదినాన గ్రామాల్లో, పట్టణాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగల పతంగులను ఎగురవేయడం ఆనవాయితీ. ప్రాచీనకాలంగా వస్తున్న సంప్రదాయం. యాంత్రిక జీవనం వల్ల పతంగులను ఎగురవేయడం ఇటీవల కాలంలో చాలా తగ్గింది. పట్టణీకరణ వల్ల మైదాన ప్రాంతాలు కనుమరుగై పతంగులు స్వేచ్ఛగా ఎగురవేసే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరవాసులకు పతంగుల ఎగురవేతలో ఉన్న ఆనందాన్ని మరోసారి కలుగచేసేందుకు ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో 2017లో నగరంలో జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది తెలిసిందే. కలెక్టర్ పమేలా సత్పతి హయాంలో 2019లో కూడా ఒకసారి రాష్ట్ర స్థాయి పతంగుల పండుగను ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.



ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న నర్సులు

నర్సులను దూషించిన స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎంలో విధులు బహిష్కరించి నర్సుల ఆందోళన

హనుమకొండ అర్బన్, జనవరి11: సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సులు ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం విధులు బహిష్కరించి పరిపాలన విభాగం ఎదుట ధర్నా, ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డులో పారిశుధ్య చర్యలు నిర్వహించకపోవడంతో సంబంధిత వార్డు హెడ్ నర్సు పద్మలత విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజమ్మ అనే మహిళా ఉద్యోగి హెడ్‌నర్సుపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడింది. అంతేకాకుండా ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న నర్సులందరినీ ఉద్దేశించడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. నర్సుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన స్వీపర్‌ను విధుల నుంచి తొలగించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూపరింటెండెంట్ కోరడంతో నర్సులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రంపహాడ్'కు భారీ బందోబస్తు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



జాతర రోడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్రంలో రెండో అతిపెద్దజాతరైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారాలమ్మలను ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్, దుగ్గంపేట, ఆత్మకూరు నుంచి అలాగే చౌళ్లపల్లి ద్వారా వచ్చే రోడ్డు పెద్దాపురం నుంచి జాతరకు వచ్చే రోడ్లను డీసీపీ పరిశీలించారు. జాతర చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు పంటలు వేయవద్దని పోలీసు అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో కంటే ఈసారి భారీగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బోరిగం స్వామిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. జాతర చుట్టూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు మఫ్టీలో స్పెషల్ పార్టీ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత చేసి క్షణాలలో పోలీసులు చేరకునేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాళోజీ జంక్షన్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుడు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి రూ.2016, రెండో బహుమతి రూ.1,116, మూడో బహుమతి రూ.516లు ఉంటాయని సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ప్రోత్సాహక బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్ట్‌లు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు సెల్ నంబర్లు 83673 56765 / 83670 56765 లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే ఇక్కడికి వచ్చాన నమోదు చేసుకోవచ్చన్నారు.

ముమ్మరంగా మేడారం పనులు



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్



జీవోటీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మేడారం, జనవరి 11: తాడ్వాయి మండలం మేడారంలో మహాజాతర అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా భక్తులకు తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మేడారం పరిసరాల్లో ఉన్న 200కు పైగా చేతి పంపులను మరమ్మతులు చేపడుతున్నారు. అలాగే ఎ జంపన్నవాగు స్నానఘట్టాలపై బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ షవర్ బాత్‌లను ఇరిగేషన్ శాఖ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

అదనపు పార్కింగ్ స్థలాల పరిశీలన

మహాజాతరలో భక్తులుకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఎస్పీ శబరీశ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన మేడారం సందర్శించారు. అదనపు పార్కింగ్ కోసం స్థలాలను పరిశీలించారు. మహా జాతరలో భక్తులకు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై పకడ్బందీగా సన్నాహాలు చేస్తున్నారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ ఉన్నారు.

హెల్త్ క్యాంప్ కోసం..

మేడారంలో ఏర్పాటు చేయనున్న ప్రధాన హెల్త్ క్యాంప్, మీడియ సెంటర్‌ను ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో అంకిత్ గురువారం పరిశీలించారు. డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి సందర్శించారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ముందస్తు మొక్కుల కోసం మేడా రానికి భక్తుల తాకిడి పెరుగుతుందన్నారు. అందుకు తాత్కాలిక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఉచిత వైద్యం అందు బాటులో ఉండాలని అన్నారు. వైద్య శిబిరానికి కావాల్సిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అధికారులు హేమలత తదితరులు ఉన్నారు.

కంకరలో దిగబడుతున్న వాహనాలు



మేడారం, జనవరి 11: తాడ్వాయి మండలం మేడారం మహాజాతరకు భక్తుల సౌకర్యార్థం రోడ్లు భవనాల శాఖ అధికారులు వారం క్రితం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో గుంతల వద్ద మరమ్మతులు చేపట్టి బీటీ తొలగించి కంకర పోశారు. రోలింగ్ చేసి వాటర్ చల్లకపోవడంతో వాహనాలు కంకరలో దిగబడుతున్నాయి. దీంతో జాతరకు ముందస్తుగా వస్తున్న భక్తులకు తిప్పలు తప్పడం లేదు. వాహనాలను కంకరలో నెట్టుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

ట్రస్టు బోర్డులో అవకాశం కల్పించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 11 : మేడారం జాతర ట్రస్టుబోర్డులో ఎదిర పగిడిద్దరాజు ఆలయ కమిటీ సభ్యులకు అవకాశం కల్పించాలని తలపతి పర్శిక తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆలయ కమిటీ సమావేశం జరగగా తిరుపతి పాల్గొని మాట్లాడారు. మేడారం మహాజాతరలో ఎదిర పగిడిద్దరాజును గద్దెమీదికి ఆహ్వానించాలని, ఇలవేల్పుల సమ్మేళనంలో పాల్గొనే ప్రతి ఇలవేల్పుకు రూ.60వేలు ఇవ్వాలని, ప్రతి ఇలవేల్పుకు దూప, దీప, నైవేద్యం అందించాలని కోరారు. ఈసమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పర్శిక పుల్లయ్య, జగన్నాథం, రాజారావు, రామారావు, సూర్యారావు, కన్నయ్య, కామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులనే వినియోగించాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

మేడారం, జనవరి 11 : జ్యూట్ బ్యాగులనే వినియోగించాలని ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్(జాతీయ హరిత దళం) కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, సైన్స్ అధి కారి అప్పని జయదేవ్ ఆధ్వ ర్యంలో పాఠశాలల్లో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన నిర్వహించారు. మేడారం సమ్మక్క భవనంలో జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించారు ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జ్యూట్ బ్యాగులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఫిబ్రవరి 21 నుంచి మేడారంలో జరిగే మహా జాతరలో ప్లాస్టిక్‌ను నిషేధించి ప్రతి ఒక్కరూ విధిగా జ్యూట్ బ్యాగ్‌లను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్ పాల్గొన్నారు.

సింగరేణి అధికారులతో జీఎం సమావేశం



సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం

కాకతీయఖని, జనవరి 11: భూపాలపల్లి ఏరియా సింగరేణి అధికారులతో జీఎం బళ్లారి శ్రీనివాసరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 18 నుంచి 21 వరకు జరగనున్న కోలిండియా లెవల్ ఇంటర్ హాకీ టోర్నమెంట్‌ను పట్టణంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వస్తారని అన్నారు. వారికి బస, భోజన వసతులు, తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్యోతి, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్, కుమారస్వామి, తుకారాం, రాజగోపాల్, బాలరాజు, గుండు రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురుపిల్ల పండుగకు నిధులు కేటాయించాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 11: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు ముందుకు ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం వద్ద నిర్వహించే ఎదురుపిల్ల పండుగకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు, పూజారులు ఏటూరునాగారంలో ఐటీడీఏ పీవో అంకిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మేడారం మహాజాతరను పురస్కరించుకుని ఫిబ్రవరి 14న జాతరకు వారంరోజుల ముందు నాయకపోడ్‌లు, పూజారులు ఆచార సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ఎదురుపిల్ల పండుగ నిర్వహిస్తారని, ఇందుకోసం రూ.7లక్షల నిధులను కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గట్టమ్మ దేవాలయ ప్రధాన పూజారులు కొత్త సదయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, కృష్ణ, భాగ్యలక్ష్మి, మల్లయ్య, సురేష్, నాయకపోడ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు

గణపురం, జనవరి 11: చెరువు మట్టిని రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారని ఇరిగేషన్ అధికారులు గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న పెద్దమ్మకుంట, కుమ్మరి కుంట, గణపురం ట్యాంక్ వద్ద చెరువు మట్టిని గుర్తు తెలియని వ్యక్తులు తరలిస్తున్నారని ఇరిగేషన్ ఏఈ సమ్మారావు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తే ఆ వాహనాలను సీజ్ చేయాలని కోరారు.

పదో తరగతి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

కన్నాయిగూడెం, జనవరి 11 : పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని చింతగూడెం, బుట్టాయిగూడెం, ప్రాథమిక పాఠశాలలు, ముప్పనపల్లి, గుర్రేవుల ఉన్నత ప్రాథమిక పాఠశాలలను ఆయ గురువారం సందర్శించారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు వారంలో ఐదు రోజులు బోధన, ఆరోరోజు వారాంత పరీక్ష, నెలకోసారి పరీక్షలు నిర్వహించి ఫలితాలు రాబట్టాలన్నారు.

పీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ కమిటీ మీటింగ్

కాటారం, జనవరి11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం చేయాల్సిన చర్యలపై చర్చించి తీర్మానించారు. లక్షలాది రూపాయల హెచ్‌డీఎస్, కాయకల్ప నిధులు దుర్వినియోగం చేసిన గత మెడికల్ ఆఫీసర్ రామారావుపై విజిలెన్స్ ఎంక్వైరీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, డబ్బులను రికవరీ చేయాలని తీర్మానించారు. నిధులు సొంతానికి వాడుకున్న వైద్యాధికారిపై చర్యలకు అధికారులు తాత్సారం చేయడంపై సభ్యులు మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న నిధులతో ఆస్పత్రి అభివృద్ధికి చేయాల్సిన పనులు, కొనుగోలు చేయాల్సిన వస్తువులపై చర్చించి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కొమురయ్య, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు అరుణ, వీణ, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, నస్తూరుపల్లి సర్పంచ్ శేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫర్జానాబేగం, సీహెచ్‌వో నిర్మల, యూడీసీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, జనవరి 11: మండలంలోని కొర్కిశాల మోడల్‌స్కూల్‌లో 6,7 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 12నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశపరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందని పేర్కొన్నారు. జనరల్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125 అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో

తాడ్వాయి, జనవరి 11: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన తరగతిగదులు, పాఠ శాల ఆవరణను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సెలవులకు ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు సెలవుల తర్వాత 18వతేదీన పాఠశాలకు వందశాతం హాజరుకావాలని సూచించారు.

జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సందర్శన

వెంకటాపూర్(రామప్ప), జనవరి 11: మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి గ్రామాన్ని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు గురువారం సందర్శించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక పాఠశాల ఉండాలనే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు రాజు సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు, అంగన్‌వాడీ టీచర్ అభిప్రాయాలు తీసుకున్నారు. గ్రామంలో పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. 2013 ఫిబ్రవరిలో పిల్లలు లేక పాఠశాల మూసివేయబడిందని, అప్పటి నుంచి టీచర్లు లేక పిల్లలంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని కోఆర్డినేటర్ దృష్టికి అంగన్‌వాడీ టీచర్ తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో పాఠశాల మళ్లీ పునఃప్రారంభానికి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ యాసం విక్రమ్‌రాజ్, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సోమిడి కరుణాకర్, సీఆర్పీ గుగులోత్ దేవేందర్, సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని



మాట్లాడుతున్న దీక్షిత్ కుమార్

మల్హర్, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్మెంట్ ప్రభారి సెంట్రల్ టీం ఆఫీసర్ దీక్షిత్ కుమార్ అన్నారు. మండలంలోని కొయ్యూర్‌లో ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం జీవన్ జ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన, పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్, పీఎం జన్‌ధన్ యోజన, పీఎం స్వానిధి యోజన, సుకన్య సమృద్ధి యోజన, పీఎం ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, ఎంపీడీవో నర్సింహమూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ లింగమూర్తి, ఎంపీటీసీ నాగరాణి, ఉప సర్పంచ్ మమత, బ్యాంకు మేనేజర్లు, ఏపీఎం కమల, ఆయుష్మాన్ భారత్ టీం లీడర్ అనీల్, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరల సంక్షేమానికి కృషి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 11: వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వడ్డె ఓబన్న జయంతి వేడుకలకు కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న నేటితరానికి ఆదర్శమన్నారు. ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం హర్షదాయకమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి దేశంలో అధికారంలోకి వస్తే వడ్డెరల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారన్నారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ 1857లో జరిగిన సిపాయిల పోరాట కంటే ముందే ఓబన్న ఆంగ్లేయులతో పోరాడన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శైలజ, వడ్డెర కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి వేడుకలు

ములుగు కలెక్టరేట్: జిల్లాకేంద్రంలోని సంక్షేమభవన్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ముందుండి పోరాడారని కొనియాడారు. భారతదేశ దేశభక్తి చరిత్రలో సముచిత ఖ్యాతి పొందారని అన్నారు. ఈకార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి లక్ష్మణ్, తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర జేఏసీ కన్వీనర్ తురక వీరబాబు, ములుగు జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల రమేష్, నాయకులు గొల్లెన సారంగపాణి, సంతోష్, సిబ్బంది రేణుక, మానస, సరిత, గోపాలచారి, రత్నాకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను అమలు చేయాలని ఎమ్మెల్యేకు యూటీఎఫ్ వినతి

భూపాలపల్లిటౌన్, జనవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు టీఎస్ యూటీఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రాన్ని అందించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పీఆర్‌సీ నివేదికను త్వరగా ఇప్పించాలని, జీవో 317లో తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్ డీఏను ఇప్పించాలని, పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్..రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు వీరన్న, సూర్యకిరణ్, కుమారస్వామి, వేణు, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 142ను రద్దు చేయాలి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 11: జీవో 142ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. జీవో 317 బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వాడబలిజలు ఉద్యమించాలి

జిల్లా అధ్యక్షుడు ఆనంద్

మంగపేట, జనవరి 11: వాడబలిజ కులస్థులు తమ హక్కుల సాధన కోసం సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గార ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలోని పొద్మూరు కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతం కోసం వాడబలిజలు కృషి చేయాలని అన్నారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రావుల రమేష్, ఉపాధ్యక్షుడిగా డర్ర సతీష్, ప్రచార కార్యదర్శిగా బద్ది రఘుబాబు, సభ్యులుగా ఏట్ల లక్ష్మణ్, బద్ది సమ్మయ్య, బొల్లె రాములు, బొల్లె శ్రీను, పానెం నర్సింహరావు, ఏట్ల గణేష్, బద్ది పాపారావు, డర్ర వెంకటేశ్, బొల్లె లాలయ్య, ఎర్రావుల ముత్తయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మంగపేట, జనవరి 11: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మండలంలోని బ్రాహ్మణపల్లి ఏహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లెబోయిన కోటయ్య, జబ్బ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్తీ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి పూనేం వరలక్ష్మి, మహిళా ఉపాధ్యక్షురాలు మల్లెల అనసూయ, జిల్లా ఉపాధ్యక్షుడు సున్నం బుచ్చయ్య, ఉపాధ్యాయులు ఎస్. నాగేశ్వర్‌రావు, టి. బొర్రయ్య, ఎం. రాజశేఖర్, పి. సంపత్, కె. రామయ్య, టి. రంజిత్, కె.అశోక్, సూర్యనారాయణ, జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

స్మాల్ బ్రేక్!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. ఆ కార్యాలయాల్లో పనిచేసే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. ఆతర్వాత పలు పనులకు సంబంధించి కీలక ఫైళ్లు కొన్ని లభించకపోవడంతో సంబంధిత అధికారులను విచారించినట్టు సమాచారం. మూడు రోజుల తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న కీలక ఫైళ్లు, హార్డ్ డిస్కులను ప్రత్యేక వాహనంలో గురువారం హైదరాబాద్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తరలించారు.

ఓ ఏఈఈపై ఆగ్రహం

కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడు రోజులుగా మహదేవపూర్‌లోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో చేపట్టిన తనిఖీలకు సహకరించలేదని ఓ ఏఈఈపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీలో పనిచేసే ఆ ఏఈఈ విజిలెన్స్ అధికారులు అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా గోప్యత పాటించడంతో తీవ్రస్థాయిలో మండిపడ్డారని సమాచారం. తమకు పూర్తి స్థాయిలో సహకరించాలని, లేదంటే స్థానిక పోలీసులతో కఠినంగా విచారణ చేపట్టాల్సి ఉంటుందని ఘాటుగానే మందలించారని తెలిసింది.

విచారణ ఇంకా పూర్తికాలే..

- రమేష్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ

మూడు రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌తోపాటు మహదేవపూర్ ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో చేపట్టిన తనిఖీల్లో పలు కీలక ఫైళ్లు, సమాచారాన్ని సేకరించామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ కొనసాగుతుందని అన్నారు.. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. మూడు రోజుల తనిఖీల్లో సీజ్ చేసిన కీలక ఫైళ్లు, హార్డ్ డిస్కులను విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని తమ ముఖ్య కార్యాలయానికి తరలిస్తున్నామని చెప్పారు.

భారతీయ సంస్కృతి ప్రతిబింబించాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 11: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రజలు పండుగలు జరుపుకోవాలని డీసీఈబీ కార్యదర్శి ఎన్నెం విజయమ్మ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులతో కలిసి పతంగులను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పతంగులను ఎగురవేయాలని, ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్యాతం రాజేందర్, పిట్టల మల్లయ్య, బానోత్ దేవ్‌సింగ్, శిరుప సతీష్‌కుమార్, తోట చంద్రమౌళి, గుండేటి మమత, పోరిక వసంత, సంగ చేరాలు, శారద, చల్లా భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

వెంకటాపురం(నూగూరు), జనవరి 11: ఎవరైనా బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ములుగు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించడమంటే బాలల హక్కులను హరించడమేనని, బడి బయట ఉన్న పిల్లలను కూడా బాలకార్మికులుగానే గుర్తించాలన్నారు. బాలల హక్కులను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 14ఏళ్లలోపు పిల్లలను ఎవరూ పనిలో పెట్టుకోవద్దని అన్నారు. ఈ సదస్సులో సీడీపీవో శిరీష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, ప్రొటెక్షన్ అధికారులు హరికృష్ణ, సుదర్శన్, ఆటో డ్రైవర్లు, తాపీమేస్త్రీలు, ట్రాక్టర్, బైక్ మెకానిక్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కాటారం విద్యార్థి ఎంపిక



అరవింద్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కాటారం, జనవరి 11:కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి డీ అరవింద్ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10న ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహణ ఓ సిటీ మైదానంలో జరగగా అండర్-14 బాలుర విభాగంలో అరవింద్ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి, పీడీ సిరంగి రమేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి రవాణా చార్జీలు, బ్యాట్, షూస్ కోసం రూ.5వేలు ఆర్థికసాయంగా అందించారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

మహదేవపూర్ రూరల్, జనవరి 11: మండలంలోని 18 గ్రామపంచాయతీలకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యిందని తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 10,946 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేశామని పేర్కొన్నారు. మండలంలోని గ్రామపంచాయతీల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆ వెల్లడించారు. అంబట్‌పల్లి 786, అన్నారం 550, బెగ్లూర్ 765, బొమ్మాపూర్ 583, బ్రహ్మణపల్లి 414, చంద్రుపలి 202, ఎడపల్లి 234, ఎల్కేశ్వరం 238, ఎన్కపల్లి 372, కాళేశ్వరం 1137, కుదురుపలి 259, మద్దులపల్లి 244, మహదేవపూర్ 2824, మెట్‌పల్లి 239, పల్గుల 387, పెద్దంపేట్ 229, రాపల్లికోట 267,సూరారం 1216 దరఖాస్తులు రాగా అన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామని అన్నారు.